సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ): కులగణన సర్వేలో వివరాల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, ఈ నెల 28లోగా వివరాలు నమోదు చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సర్వేలో పాల్గొనని వారి కోసం టోల్‌ఫ్రీ నంబర్ 040-21111111ను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చి వివరాలు నమోదుచేయనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో, వార్డు ఆఫీసులకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవచ్చని స్పష్టంచేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలనుకునేవారు http://seeepsurvey.cgg.gov.in ద్వారా తమ సమాచారాన్ని ఇవ్వవచ్చని సూచించారు. కులగణన సర్వే జరగని ప్రాంతాల్లో కులసంఘాల నేతలు, మేధావులు అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెద్ద కొడుకు భూమి లాక్కున్నడు

- అక్రమంగా పట్టా చేయించుకున్నడు
- కొడుకు ఇంటి ఎదుట తల్లి దీక్ష

డోర్నకల్, ఫిబ్రవరి 17: 'నా భూమిని పెద్ద కొడుకు అక్రమంగా పట్టా చేయించుకున్నాడు. న్యాయం చేయండి' అంటూ కన్న కొడుకు ఇంటి ఎదుట ఓ వృద్ధురాలు దీక్ష చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్లలో జరిగింది. గ్రామానికి చెందిన తాటికొండ కమలమ్మ పేరిట ఉన్న రెండు ఎకరాల 20 గుంటలను పెద్ద కుమారుడు మల్లారెడ్డి తన స్నేహితుడైన రెవెన్యూ అధికారి సహకారంతో పట్టా చేయించుకున్నాడు. కన్నకొడుకు మోసం చేశాడని తెలుసుకున్న కమలమ్మ తీవ్ర మనోవేదనకు గురైంది. తన భూమి తనకు తిరిగి ఇవ్వాలని కొడుకు ఇంటి ఎదుట సోమవారం దీక్షకు కూర్చున్నది. తనకు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించనని స్పష్టం చేసింది.

బీజేపీ, కాంగ్రెస్ కలిసి డ్రామాలు

సర్వే తప్పిదాలను పక్కదారి పట్టించడానికి నాటకాలు

- సీఎం రేవంత్‌వి వంకర మాటలు
- రాహుల్‌ది ఏ మతమైతే ఏందీ?
- ప్రధాని మోదీది ఏ కులమైతే ఏందీ?
- నాటకాలాడుతున్న రెండు పార్టీలు
- అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టాలి
- కేంద్రం అమలు చేయాలి
- ఎర్రవల్లిలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని ఎర్రవల్లిలో హోమంలో పాల్గొన్న అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినదిస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

మర్కూక్, ఫిబ్రవరి 17: బీసీ రిజర్వేషన్ల అంశాన్ని దృష్టి మరల్చడానికి కాంగ్రెస్, బీజేపీ కలిసి డ్రామాలు చేస్తున్నాయని, కులగణన సర్వేలో బీసీల తప్పుడు లెక్కల చర్చను తప్పు దారిపట్టించడానికి మోదీ బీసీనా.. కాదా అన్న చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 71వ పడిలోకి అడుగుపెట్టిన సందర్భంగా సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవల్లిలో సోమవారం గ్రామస్తులు, యువకులు, బీఆర్ఎస్ నేతలు కలిసి ఆయుష్ హోమం, సుదర్శన యాగం నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత యాగంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ 14 నెలల పాలనలో ప్రజలకు నరకం చూపిస్తున్నదని మండిపడ్డారు. బీసీల సర్వే లెక్కలు సరిగా చేయలేక సీఎం రేవంత్‌రెడ్డి నాటకాలాడుతున్నారని ఆరోపించారు. కులగణన పేరిట కాలయాపన చేశారే తప్ప లెక్కలు పూర్తిగా చేయలేదని విమర్శించారు. మోదీ బీసీ అయితే ఏందీ.. కాకపోతే ఏందీ, రాహుల్‌గాంధీ ఏ మతం అయితే మాకేందీ.. ఒకరిపై ఒకరు తిట్టుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండోసారి బీసీ సర్వే నిర్వహిస్తున్నా దానిపై తగిన ప్రచారం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలని, దానిని కేంద్రంలోని బీజేపీ సర్కారు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు అమలు చేయకుండా రాహుల్‌గాంధీ మతం గురించి మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వంకర టింకర మాటలతో ప్రజలను ఆగం చేస్తున్నారని, ఏ ఒక్క సమస్యకు పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో తన ప్రాణాన్ని, పదవులను పక్కనపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కారుణజన్ముడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల బతుకులు ఆగం అవుతున్నాయని, కేసీఆర్ మళ్లీ సీఎంగా రావాలని రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలు పూజలు చేస్తున్నారని ఎమ్మెల్యే కవిత తెలిపారు.

పాములపర్తిలో పూలవర్షం

ఎమ్మెల్సీ కవిత ఎర్రవల్లికి వెళ్తున్న క్రమంలో పాములపర్తిలో బీఆర్ఎస్ నేతలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆమెపై గులాబీ రేకులతో పూలవర్షం కురిపించారు. వర్దరాజ్‌పూర్‌లో వరదరాజులస్వామి ఆలయాన్ని సందర్శించిన కవిత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కవిత బాగుండాలని గతంలో బీఆర్ఎస్ నేతలు కట్టిన ముడుపు విప్పి స్వామివారికి మొక్కు చెల్లించారు. ఎర్రవల్లికి చేరుకుని కేసీఆర్ జన్మదినం సందర్భంగా చేపట్టిన ఆయుష్ హోమం, సుదర్శన యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కవితకు ఎర్రవల్లి మహిళలు తిలకం దిద్ది మంగళహారతులు పట్టారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పాండు, రాంచంద్రం, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కనకయ్య, బాల్‌రాజు, కృష్ణ, మల్లేశం, బాబు, రాజిరెడ్డి, కృష్ణయాదవ్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

డీసీసీ అధ్యక్షుడి స్వగ్రామంలో కాంగ్రెస్‌కు ఝలక్

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల/మద్దూరు(ధూళిమిట్ట): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్వగ్రామమైన నర్సాయపల్లికి చెందిన ముఖ్య నాయకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. మద్దూరు మండలం నర్సాయపల్లి, చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వారి అనుచరులతో సోమవారం రాత్రి బీఆర్ఎస్‌లో చేరారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్, మాజీ ఉపసర్పంచ్ శనిగరం సత్యనారాయణ, మాజీ వార్డు సభ్యులు తలారి కనకయ్య, సంతోష్‌రెడ్డి, ముస్త్యాల శ్రీహరి, రాజు, ఆకునూరు చెందిన మంతపురి సత్యనారాయణ, వారి అనుచరులు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ..జనగామ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తాము గేట్లు ఎత్తితే ఇక కాంగ్రెస్ పార్టీలో ఎవరూ ఉండరని చెప్పారు.

రాజేంద్రనగర్ కోర్టు వద్ద కోళ్ల వేలం పాటలో జనం

84 పందెం కోళ్లు రూ.16.60 లక్షలు

మొయినాబాద్, ఫిబ్రవరి 17: ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని ఫామ్‌హౌజ్‌లో కోడిపందాలు ఆడుతుండగా పోలీసులు దాడిచేసిన విషయం తెలిసిందే. ఆ దాడిలో స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లను సోమవారం రాజేంద్రనగర్ న్యాయస్థానంలో న్యాయమూర్తి సమక్షంలో వేలం వేశారు. 84 పందెం కోళ్లను వేలం వేయగా రూ.16.60లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. పందెం కోళ్లు అత్యంత ఖరీదైనవి కావడంతో ఆ బ్రీడ్ మరొకరికి దక్కనివ్వవద్దని పందెం కోళ్ల రాయుళ్లు సిండికేట్‌గా ఏర్పడి దక్కించుకున్నారు. ఈ కోళ్ల విలువ రూ.3 కోట్లు ఉంటుందని ఏపీ నుంచి వచ్చిన పందెం రాయుళ్లు పేర్కొన్నారు.

వర్గీకరణతో అవకాశాలు మెరుగు

మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ అనుబంధ కులాలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు మెరుగవుతాయని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఎమ్మెల్యేలు, సంఘాల ముఖ్య నాయకులతో సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు క్షేత్రస్థాయిలో రిజర్వేషన్ల ప్రక్రియను వివరించాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణతో ఏ కులానికి అన్యాయం జరగదని స్పష్టంచేశారు. అణగారిన కులాల్లో అసమానతలు రూపుమాపేందుకే ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, తోట లక్ష్మీకాంతారావు, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మం త్రులు మోత్కుపల్లి నరసింహులు, చంద్రశేఖర్, మాజీ ఎంపీ పసునూరు దయాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, ప్రొఫెసర్ మల్లేశం, ముంజగల విజయ్‌కుమార్, మేడి పాపయ్య, గజ్జెల కాంతం, ఏపూరి సోమన్న, కృపాకర్, మేరీ, చంద్రశేఖర్, గోపి, రాజు పాల్గొన్నారు.

జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక తప్పుల తడక

- ఇప్పటికైనా తప్పులను సరిదిద్దాలి
- ప్రభుత్వానికి మందకృష్ణ సూచన

ఖైరతాబాద్, ఫిబ్రవరి 17: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక తప్పుల తడకగా ఉన్నదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద కృష్ణ మాట్లాడుతూ 'వర్గీకరణ నివేదికను ప్రకటించే ముందు ప్రభుత్వం తగిన కసరత్తు చేయలేదు. ఆ నివేదికను సబ్‌కమిటీగానీ, క్యాబినెట్‌గానీ అధ్యయనం చేయలేదు. ఆగమేఘాల మీద అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీని వెనుక ఓ మతలబు ఉన్నది. ఈ నెల 7న లక్ష డప్పులు, వేలగొంతుల కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్నాం. దీన్ని రద్దు చేయించడానికే ప్రభుత్వం హడావుడిగా ఎస్సీ వర్గీకరణను ప్రకటించింది' అని తెలిపారు. ఎస్సీలోని అన్ని కులా లు, వాటి ఆర్థిక పరిస్థితులను సరిగా అధ్యయనం చేయకుండా, అంచనా వేయకుండానే ప్రభుత్వం ముందుకెళ్లిందని చెప్పా రు. గ్రూప్-3లో ఉండాల్సిన వారిని గ్రూ ప్-1, 2లో గ్రూప్-1, 2లో ఉండాల్సిన వారిని గ్రూప్-3లో వేశారని వెల్లడించా రు. తప్పును సరిచేసుకునే అవకాశమున్నదని, ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మందకృష్ణ సూచించారు. సమావేశంలో శ్రీ వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ అధ్యక్షుడు దత్తు పోలె, ఉమేశ్, వినోద్, ముకేశ్, రాజు, నర్సింగ్ గైక్వాడ్, రమేశ్ కాలే తదితరులు పాల్గొన్నారు.

జల దోపిడీపై కేంద్రానికి ఫిర్యాదు!

- ఏపీ వైఖరిపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయండి
- అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఏపీ కృష్ణా జలాల తరలింపుపై స్పందన
- కేటీఆర్, హరీశ్‌రావు ప్రశ్నించడంతో హుటాహుటిన సీఎం రివ్యూ
- కోటాను మించి నీటి తరలింపుపై 'నమస్తే తెలంగాణ' కథనాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి ఏపీ ఏకపక్షంగా నీటిని తరలించడంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. నిర్ణీత వాటా కంటే ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా కేంద్రం బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, పంటలకు సాగునీటి విడుదలపై హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం సంబంధిత శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను వినియోగించుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు టెలిమెట్రీ విధానమే పరిష్కారమని స్పష్టం చేశారు. టెలిమెట్రీ విధానం అమలుకు అయ్యే ఖర్చులో సగం నిధులను చెల్లించేందుకు ఏపీ ప్రభుత్వం ముందుకు రావడం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైన నిధులను ముందుగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని, వెంటనే అమలుకు చర్యలు చేపట్టాలని కోరుతూ కేఆర్‌ఎంబీకి లేఖ రాయాలని ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు.

మూడు నెలలు అలర్ట్‌గా ఉండాలి

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఎండలు పెరిగేకొద్దీ తలెత్తే గడ్డు పరిస్థితులను ముందస్తుగా అంచనా వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా పరిష్కార మార్గాలు కనుగొనాలని పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీతో పాటు ప్రధాన ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగం వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

కేటీఆర్, హరీశ్ ప్రశ్నించడంతో రివ్యూ

ఏపీ జల దోపిడీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం నిలదీయడంతో సీఎం రేవంత్ రెడ్డి హుటాహుటిన రివ్యూ నిర్వహించారు. ఏపీ యథేచ్ఛగా కృష్ణా జలాలు తరలించుకుపోతున్నా.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కన్నెత్తి చూడటం లేదని ఇరువురు నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. రేవంత్ సర్కారు మౌనంతో తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతున్నదని మండిపడ్డారు. కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతున్న వైనంపై 'నమస్తే తెలంగాణ' గత కొన్ని రోజులుగా వరుస కథనాలు ప్రచురించింది. ఆదివారం సైతం 'ఏపీ జలదోపిడి!' పేరిట కథనం ప్రచురితమైంది. 25 రోజులుగా రోజుకు 2 టీఎంసీల నీటిని ఏపీ తరలించుకుపోతున్నదని సాక్ష్యాధారాలతో సహా వెల్లడించింది. వేసవికి ముందే ప్రాజెక్టులు ఖాళీ అవుతున్నాయని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏపీ ఏకపక్షంగా నీటిని తరలించడంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాల వారీగా ప్రణాళికలు

ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. సాగు, తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. వేసవిలో సాగు, తాగునీటితో పాటు విద్యుత్తు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని, వీటిని అందించేందుకు జిల్లా కలెక్టర్లు చొరవ చూపాలని ఆదేశించారు. సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి జిల్లాలవారీగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ఆయకట్టులో పంటలు, నీటి విడుదల తీరును కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలని పేర్కొన్నారు. నిర్ణీత ఎజెండాను ఖరారు చేసుకుని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన ఆదేశాలు జారీచేయాలని సీఎస్ శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అలసత్వాన్ని ఉపేక్షించం

అధికారులతో సమీక్షలో సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థలో అలసత్వాన్ని ఉపేక్షించబోమని, ఉద్యోగులు, కార్మికులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సీఎండీ ఎన్ బలరాం హెచ్చరించారు. సంస్థ ఉన్నతి కోసం శ్రమించే వారికే చోటు ఉంటుందని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి సంస్థలో స్థానం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి భవన్‌లో సోమవారం 11 ఏరియాల జీఎంలు, 39 గనులకు సంబంధించిన ప్రాజెక్ట్ అధికారులు, ఏజెంట్లతో తొలిసారిగా సమీక్షించిన సీఎండీ.. నిర్దేశిత లక్ష్యాలు, పురోగతిపై ఆరాతీశారు. పలు సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించకపోవడంపై సీఎండీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల్లో స్కిల్‌డెవలప్‌మెంట్, గనుల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. రోజుకు 8 గంటలు పనిచేయాలని, మస్టర్ వేసి విధులకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమీక్షలో డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

తునికాకు ప్రూనింగ్ చేపట్టాలని ధర్నా

భద్రాచలం, ఫిబ్రవరి 17 : టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి వెంటనే తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం డివిజన్ అటవీ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తునికాకు సేకరణ ప్రక్రియను ప్రారంభించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు.

ముద్దులిస్తే బాకీ అడుగను!

- *మహిళపై అధికార పార్టీ నేత అనుచిత ప్రవర్తన!*
- *రంగారెడ్డి జిల్లా కేశంపేట పీఎస్‌లో కేసు నమోదు*

కేశంపేట, ఫిబ్రవరి 17: రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలో కాంగ్రెస్‌లోని ఓ కీలక నాయకుడిపై పోలీసులు కేసు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. కేశంపేట పోలీసుల కథనం ప్రకారం కేశంపేటలో ఓ ఉపాధ్యాయురాలు స్థానికంగా కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డికి చెందిన పాఠశాలను లీజుకు తీసుకున్నారు. కానీ వ్యక్తిగత కారణాలతో ఆమె రెండేండ్లకే ఒప్పందం నుంచి వైదొలిగారు. కానీ స్కూలుకు చెందిన కొన్ని మరమ్మతులను సదరు నాయకుడు చేయించాడు. ఇందుకు సంబంధించిన డబ్బులు ఇవ్వాలని మహిళకు తరచుగా ఫోన్ చేస్తున్నాడు. కానీ తాను ఇవ్వబోనని ఆమె తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో మహిళకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడినట్టు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా ముద్దులిస్తే డబ్బులు అడగనంటూ కాంగ్రెస్ నాయకుడు ఫోన్‌లో వ్యాఖ్యలు చేశాడని మహిళ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad - 500 037 (TS) INDIA
WALK-IN INTERVIEW
Notification No. CITD/Trg/February-II/25 Date: 10-02-2025
CITD intends to engage suitable candidates in the following posts which are purely on consolidated payment and on contractual basis initially for a period of 11 months, which will be renewed from time to time on performance review of the candidate and need of the Institute.

S.NO.	POSITION	DATE OF INTERVIEW
1	Faculty for Electrical Engineering	24th Feb, 2025
2	Faculty for Electronics Engineering	24th Feb, 2025
3	Administrative Assistant	25th Feb, 2025

For detailed notification: Visit the link "Walk-in Interview-Feb-II, 2025" on our website www.citdindia.org. Sd/- PRINCIPAL DIRECTOR

భారత ప్రభుత్వము, కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ
డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్
ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం
పత్రికా ప్రకటన
[illegible]
తేది: 17.02.2025



బెంగళూరు వెళ్లే వారికి 10శాతం రాయితీ

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తేతెలంగాణ): తమ బస్సుల్లో బెంగళూరుకు ప్రయాణించే వారికి టికెట్ చార్జీలో 10% రాయితీ ఇస్తున్నట్టు ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ వీసీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీతో ప్రయాణికులకు రూ. 100 నుంచి రూ.160 వరకు ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. టికెట్లు ముందస్తుగా బుక్ చేసుకునేందుకు https://tgsrtc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వరంగల్‌లో ప్రొఫెసర్ కోదండరాం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కేఎంసీ విద్యార్థులు

కేయూలో కోదండరాం దిష్టిబొమ్మ దహనం

నకిలీ వైద్యులను ప్రోత్సహిస్తున్నారని వైద్య విద్యార్థుల ఫైర్

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 17: ప్రొఫెసర్ కోదండరాం వ్యాఖ్యలు నకిలీ వైద్యులను ప్రోత్సహించేలా ఉన్నాయంటూ హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) వరంగల్ విభాగం సభ్యులు, కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు మండిపడ్డారు. ఈనెల 19న ఆర్‌ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని ఆయన కోరడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. సోమవారం కేఎంసీ ప్రధాన గేట్ ఎదుట నిర్వహించిన నిరసనలో కోదండరాం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శాస్త్రీయత, అర్హత లేకుండా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులను ప్రోత్సహిస్తున్నారంటూ కోదండరాంపై మండిపడ్డారు. ఇప్పటికైనా కోదండరాం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డంపింగ్‌యార్డును అడ్డుకుందాం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 17 : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డును ఐక్యంగా అడ్డుకుందామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అఖిలపక్ష సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. డంపింగ్‌యార్డు కోసం కేటాయించిన భూమి ప్రభుత్వ భూమి కాదని సర్వేలో తేలిందన్నారు. డంపింగ్‌యార్డును రద్దు చేసే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో వాయు, జల కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటుందని, పర్యాటకాభివృద్ధికి విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశాం.



మెదక్‌లో జిల్లా నర్సాపూర్‌లో నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి